క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ


సూరప్పడుని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: మహంతిపాలెం గ్రామానికి చెందిన గండమాన సూరప్పడుకు చెందిన 65 గొర్రెలు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాయి. దీంతో ఆయన తీవ్రంగా నష్టపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం సూరప్పడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున బీమా వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె రామునాయుడు ఇటీవల దుండగుల దాడిలో గాయపడి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నాడు. అయన్ను కూడా ఎమ్మెల్యే పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పర్యామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె అప్పలనర్సు నాయుడు, కెల్ల రమణ, మంత్రి శ్రీను, కెల్ల క్రిష్ణ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి


మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా సక్రమంగా పథకాలు అందుతున్నాయన్నారు. సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీలు మీసాల సాద్వీమణి, తోలేటి వెంకటరావు, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు దేవరవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

దేవరవలస సచివాలయం పరిధిలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిర్వహిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి తెలిపారు.

వివాదాల్లేకుండా రీసర్వే పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: రైతుల మధ్య వివాదాల్లేకుండా భూముల రీసర్వేను పూర్తి చేయాలని తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర రీసర్వేను చేపట్టిందన్నారు. సర్వే సమయంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసకోవాలన్నారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రైతుకు తెలియజేయాల్సిన బాధ్యత సర్వే సిబ్బందిపై ఉందన్నారు. ఇప్పటివరకు సర్వే పూర్తి చేసిన రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దుల గుర్తింపు పూర్తిచేయాలన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పరిశీలన

సారవకోట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి చేరిన జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతా ప్రమాణాలను సమగ్ర శిక్ష సిబ్బంది శ్రీనివాసరావు, సుధాకర్ బుధవారం పరిశీలించారు. యూనిఫాం, నోట్ బుక్స్, బ్యాగ్‌లు వచ్చాయి. వీటిని తప్పనిసరిగా పరిశీలించి తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యత లేనివి తిరిగి పంపించాలని ఎంఈఓ ఎం.వి.రమణను సూచించారు.

ముగిసిన గ్రామ పండగలు


కొత్తూరు: కుద్దిగాంలో ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, భక్తులు

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం గ్రామ దేవత రూపునిమాత పండగలు బుధవారంతో ముగిశాయి. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పండగలు ఈ నెల అయిదో తేదీన ప్రారంభయ్యాయి. గ్రామ దేవతకు ముర్రాటలు, ఘటాలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. ఐదు రోజలపాటు గ్రామంలో పలు సాంస్కృతిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. కాళీమాత వేషాధరణలు ఆకుట్టుకున్నాయి. ఆఖరి రోజు ప్రతీ ఇంట్లో విందు పెట్టడంతో గ్రామం ప్రజలతో నిండిపోయింది.

అర్హులందరికీ సంక్షేమం

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- ఇబ్రహింబాద్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఇబ్రహింబాద్ గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రేషన్‌కార్డు వారీగా నాలుగేళ్లలో వర్తించిన ప్రభుత్వ లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత పాలనలో జన్మభూమి కమిటీలు తమకు నచ్చిన వారికి, ఒక వర్గం వారికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్నట్టు చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందజేస్తున్నామన్నారు. మహిళల ప్రగతికి ప్రత్యేకంగా కృషిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రయోజనాలు లక్ష్యంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎస్‌ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వ్యవసాయ అధికారి సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, విద్యుత్‌శాఖ ఏఈ హరికృష్ణ, వెలుగు ఏపీఎం రామూర్తి, ఉపాధి హామీ పథకం ఏపీవో శోభాదేవి, స్థానిక సర్పంచ్ సూర కృష్ణవేణి, ఉపసర్పంచ్ కిల్లి సరోజనమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, నాయకులు బెండు రామారావు, సూర అప్పారావు, కిల్లి రఘురాం పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గుర్తింపు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్


కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని స్వచ్ఛందసంస్థలు, అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది సహకారంతోనే రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం ద్వారా గుర్తింపు వచ్చిందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పతకం రావాడం ఆనందంగా ఉందన్నారు. రెడ్ క్రాస్ ద్వారా విశిష్ట సేవలందించినందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ ఇటీవల బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ద్వారా సేవలు మరింత విస్తృతం చేయాలని, నిరాశ్రయులను, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 36 అంశాలపై సామాజిక సేవా కార్యక్రమాలు చేసే ఘనత శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకే దక్కిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ సేవకులు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. భవిష్యత్‌లో మరిన్ని స్ఫూర్తిదాయకమైన సామాజిక సేవలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, మానవతావాదులు ముందుకొచ్చి శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్, కె.వి.రమణమూర్తి, గుడ్ల సత్యన్నారాయణ, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, బి.వి రవిశంకర్, బి.దేవీప్రసాద్, ఆర్టీసీ పీఆర్వో బీఎల్‌పీ రావు, పి.పృధ్విరాజ్ ఉన్నారు.

వ్యాక్సినేషన్‌తో వ్యాధుల నివారణ


లావేరు: లింగాలవలసలో గర్భిణికి వ్యాక్సినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: వ్యాక్సినేషన్‌తో వ్యాధులు రాకుండా నివారించవచ్చునని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో గర్భిణులు, పిల్లలకు ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు వ్యాక్సినేషన్ చేసే ప్రక్రియను బుధవారం చేపట్టారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షించిన వైద్యురాలు మాట్లాడుతూ.. వ్యాధులు రాకుండా ఉండటం కోసం పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తున్నట్టు చెప్పారు. పిల్లలకు డిఫ్తీరియా, పోలియో, తట్టు, చికెన్‌పాక్స్ ప్రబలకుండా ఉండేందుకు ముందుగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

- జి.సిగడాం: ఎండల నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారిణి పొన్నాడ హరితశ్రీ సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నందున మధ్యాహ్నం వేళ ఇంటి నుంచి ఎవరూ బయటకు రావద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

గణితమంటే భయం వద్దు


లావేరు: మురపాకలో గణితంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్ కనకరాజు


ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న నాగేశ్వరరావు


రణస్థలం: పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


శ్రీకాకుళం అర్బన్: చిన్నారులకు నీతికథలు చెబుతున్న దృశ్యం


శ్రీకాకుళం అర్బన్: నీతికథలు పుస్తకాలతో చిన్నారులు

లావేరు: గణితమంటే విద్యార్థులు భయపడకూడద ని రిసోర్సుపర్సన్లు కనకరాజు, శ్యామల అన్నారు. అయితే ముందుగా లెక్కలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మురపాక, లావేరు శాఖాగ్రంథాలయాల్లో బుధవారం గణితశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థాన విలువలు, విస్తరణ రూపం, భిన్నాలు, శాతాలు కట్టడం, కూడికలు, తీసివేతలతో పాటు పలు అంశాలు గురించి తెలియజేశారు. భయం వీడితే గణితం చాలా ఈజీ అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు బాల్యం నుంచి క్రమ శిక్షణ అవసరమని న్యాయవాది నాగేశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న ఆయన వేమన, సుమతీ శతకం వంటి పద్యాలు ద్వారా నీతిని గ్రహించాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయానికి రావటం, చదవటం అలవాటు చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయ అధికారి ఎం.నీలమ్మ పాల్గొన్నారు.
- రణస్థలం: గ్రంథాలయాల్లో లభ్యమయ్యే విజ్ఞాన, పోటీ పరీక్షల పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మూడవ రోజు విద్యార్థులచే దిన పత్రికలు, కథలు చదివించడం, రాయించడం చేయించారు. మానసికోల్లాసానికి నీతి కథలు దోహదపడతాయన్నారు. పిల్లలకు చదువుతో పాటు చెస్, క్యారమ్స్, ఫజిల్, బిజినెస్ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు ధర్మారావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు కరిమజ్జి భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: చిన్నారులకు నీతిపద్యాలు చెప్పి అందులోని సారాంశాన్ని తెలియజేయాలని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా తొలుత పిల్లలచే ప్రార్థన మెడిటేషన్ చేయించారు. అనంతరం నీతి పద్యాలు వాటి తాత్పర్యాలు వివరించారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: చదువుతోనే విజ్ఞానం సాధ్యమని ఉపాధ్యాయులు టి.ఎర్రమ్మ, పి.సాయి కృష్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు, న్యూస్ పేపర్లను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా పఠనంపై ఆసక్తి కలుగుతుందన్నారు. పిల్లలతో నీతి కథలు చెప్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.ఈశ్వరరావు, గణేష్, టి.రాంబాబు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న సీతంనాయుడు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంకగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించే క్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో రూ. 4.97 కోట్ల వ్యయంతో 161 అభివృద్ధి పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ డీఈఈ ఎన్.సీతంనాయుడు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కృషితో ప్రజలకు అత్యవసరమైన పనుల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. ఎచ్చెర్ల మండలంలో 37 పనులకు రూ.1.27 కోట్లు, రణస్థలంలో 50 పనులకు రూ.1.59 కోట్లు, లావేరు 30 పనులకు రూ. 1.4 కోట్లు, జి.సిగడాంలో 44 పనులకు రూ.1.6 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులతో కూడా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. దీనికి రూ. 68 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఎచ్చెర్లలో ఏడు పనులకు రూ. 22 లక్షలు, రణస్థలంలో రూ. 35 లక్షలతో తొమ్మిది పనులు, జి.సిగడాంలో రూ. 11 లక్షలతో మూడు పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. అలాగే విజయనగరం ఎంపీ నిధులు 63 లక్షల రూపాయలతో 13 పనులు మంజూరైనట్టు చెప్పారు. జిల్లా అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు సచివాలయం, ఆరోగ్య, రైతుభరోసా కేంద్రాల పనులు శరవేగంతో జరుగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే 85 శాతం భవనాలను ప్రారంభించినట్టు వెల్లడించారు. నాణ్యాతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, గృహనిర్మాణం శాఖ ఏఈఈ మహాదాస్యం రమేష్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, సర్పంచు భూపతి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ శిబిరానికి హాజరైన బాలబాలికలతో ఎమ్మెస్సార్, ఎస్పైస్ ప్రవళ్లిక, క్రీడాధికారులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను బాలబాలికలు సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సౌజన్యంతో జిల్లా బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటుచేసిన బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలను శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్సై ఎం.ప్రవళ్లిక, ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా సాధనకు హాజరుకావాలని సూచించారు. కోచ్ సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. ఎస్సై మాట్లాడుతూ బాలబాలికలు తల్లిదండ్రులను బాధపెట్టేలా ప్రవర్తించొద్దని, మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు.ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాతో మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్, సెపక్‌తక్ర కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి, రాజు, వేణుగోపాల్, ఎం.రామారావు, బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను బైక్ ఢీకొని వ్యక్తి మృతి


జోగినాయుడు మృతదేహం

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారి మరియగిరి సమీపంలో జి.సిగడాం మండలం బాతువ గ్రామానికి ధనుకోటి జోగినాయుడు(43) మృతిచెందాడు. వీరఘట్టంలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి బావమరిది రెడ్డి పైడిరాజుతో కలిసి జోగినాయుడు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో పండగ సంబరాలు ముగించుకుని ఓ కుటుంబం ఆటోలో వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను బైక్‌పై వస్తున్న జోగినాయుడు ఢీ కొట్టాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న మరో బైక్ కూడా వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టడంతో జోగినాయుడు, పైడిరాజులు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే జోగినాయుడు చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గాయాలపాలైన పైడిరాజుకు చికిత్స అందజేశారు.

సమస్యలు తెలుసుకోవడానికే వార్డునిద్ర

- యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు


నిద్ర చేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రజా సమస్యలు తెలుసుకోవడమే వార్డు నిద్ర ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు వార్డు నిద్ర చేస్తున్నట్టు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థలో విలీనమైన కొత్తపేట గ్రామంలో బుధవారం రాత్రి వార్డు నిద్ర చేశారు. ఈ సందర్భంగా అవ్వాతాతలను కలిసి ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాం, గత టీడీపీ ప్రభుత్వ పాలన ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక అమ్మఒడి, చేయూత, ఆసరా పథకాలను పైసా లంచం ఇవ్వకుండా తీసుకున్నామని ఓ మహిళ గర్వంగా చెప్పుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డు, పింఛన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇచ్చానని ఓ వృద్ధుడు ఆవేదన చెందాడు. ఈ సందర్భంగా రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చారన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి మంత్రి ధర్మాన ప్రసాదరావు హయాంలో కలెక్టరేట్ నుంచి కొత్తపేట రోడ్, డ్రైనేజీలు, నూతనంగా నిర్మితమైన పార్కు అభివృద్ధికి కోటిన్నర రూపాయలు మంజూరు చేసి పనులు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు కొత్తపేట గ్రామస్తులను ఎన్నికల సమయంలో వాడుకోవడమే జరిగిందే తప్ప ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు గానీ, అభివృద్ధి పనులు ఎక్కడా చేసిన దాఖలాలు లేవన్నారు. ఇటీవల జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ఎక్కడా లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లే ధైర్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు రావాడ జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పార్టీ నాయకులు మెంటాడ స్వరూప్, చల్లా శ్రీనివాసరావు, ఊన సంతోష్‌కుమార్ గుప్తా, నందూరు చందు, సీజు, కింజరాపు రమేష్, గంజివాసు, నేవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ పొందుతున్న బాలబాలికలు


మాట్లాడుతున్న బీవీ ప్రసాదరావు, హారికాప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: స్విమ్మింగ్‌తో అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుందని డీఎస్‌ఏ సీఈవో బీవీ ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో బుధవారం సాయంత్రం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారికాప్రసాద్‌తో కలిసి ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈనెల పది నుంచి జూన్ 14వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. క్రీడాకారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది కొత్తగా చిన్న పిల్లలకు బేబీ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రోజూ ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.